పురిటినొప్పులతో కిలోమీటరు నడక

రహదారి సౌకర్యం లేక గిరిజన గర్భిణికి అవస్థలు

ప్రజాశక్తి - మెళియాపుట్టి

పాలకులు చెప్పున్న అభివృద్ధి ప్రవచనాలు గిరిసీమల దరికి చేరడం లేదు. ఇందుకు మండలంలోని కేరాసింగిలో శనివారం చోటుచేసుకున్న ఘటనే నిదర్శనం. ఎత్తయిన కొండలపై ఉన్న కేరాసింగి గ్రామానికి చెందిన గర్భిణి గొడ్డూరు తనూజకు పురిటినొప్పులు ప్రారంభమయ్యాయి. నొప్పుల తీవ్రత పెరగడంతో ఆస్పత్రికి తరలించేందుకు కుటుంబసభ్యులు 108 వాహనానికి ఫోన్ చేశారు. ఆ గ్రామానికి నేటికీ పూర్తిస్థాయి రహదారి సౌకర్యం లేకపోవడంతో, గ్రామంలోకి వెళ్లే వీల్లేక కిలోమీటరు దూరంలోనే 108 ఆగిపోవాల్సి వచ్చింది. మరోవైపు జోరున కురుస్తున్న వర్షంలో ఆశా కార్యకర్త సహకారంతో కుటుంబసభ్యులు గొడుగులు పట్టగా, పురిటినొప్పులతోనే కిలోమీటరు దూరం జారు బురదలోనే నడిచింది. బాధను పంటిబిగువున భరిస్తూ 108 వాహనం వద్దకు చేరుకుంది. అనంతరం ఆమెను టెక్కలిలోని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. వైద్యం, ఇతర అత్యవసర సమయాల్లో గిరిజనులకు ఇలాంటి అవస్థలు తప్పడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం దృష్టిసారించి మౌలిక సౌకర్యాలు కల్పించాలని గిరిజనులు కోరుతున్నారు.

కాలినడకన వస్తున్న గర్భిణి తనూజ

ఐసిడిఎస్ ఎత్తివేతకు కుట్ర

- బడ్జెట్ కేటాయింపులు పెంచాలి
- అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ
- ఘనంగా యూనియన్ జిల్లా 8వ మహాసభ

ప్రజాశక్తి - పలాస

సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బరావమ్మ

రోజురోజుకూ ఐసిడిఎస్‌కు నిధులు తగ్గిస్తూ ఈ పథకాన్ని ఎత్తివేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ అన్నారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా 8వ మహాసభ కాశీబుగ్గ ఎస్ఎంసి ఫంక్షన్ హాల్‌లో శనివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకు వస్తున్న నూతన విద్యా విధానం ఐసిడిఎస్ లక్ష్యాన్ని నిర్వీర్యం చేసేలా ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐసిడిఎస్‌కు బడ్జెట్ కేటాయింపు పెంచి మరింత బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. 2022 ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు అంగన్‌వాడీ కార్యకర్తలకు గ్రాట్యుటీ అమలు చేయాలని ఇచ్చిన తీర్పును ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. తక్షణమే అమలు చేయకపోతే పోరాటాలు చేయాల్సి ఉంటుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తెలంగాణ ప్రభుత్వం అంగన్వాడీ కార్యకర్తలకు ఇస్తున్న వేతనాలు కన్నా అదనంగా ఇస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చెప్పారని, కానీ ఆ హామీని అమలు చేయలేదన్నారు.

విధుల్లో ఉన్న అంగన్వాడీ కార్యకర్తలు మతి చెందితే కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వడంతో పాటు ఎక్స్‌గ్రేషియో ప్రకటించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీల పని భారం తగ్గించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌తో పాటు రూ.ఐదు లక్షల గ్రాట్యుటీ చెల్లించాలని కోరారు. మినీ అంగన్వాడీలను అంగన్వాడీలుగా మార్చాలన్నారు. అంగన్వాడీ కేంద్రంలో చదువుతున్న విద్యార్థులకు అమ్మఒడి పథకం అమలు చేయడంతో పాటు ఉచితంగా బూట్లు, పుస్తకాలు, బెల్టు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ కార్యకర్తలపై రాజకీయ ఒత్తిళ్లు ఆపాలన్నారు.

యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.ఉమామహేశ్వరి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలను నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతున్నాయని, ఐసిడిఎస్‌ను కాపాడుకునేందుకు ఐక్యంగా పోరాడాలన్నారు. ప్రజానాట్యమండలి కళాకారులు కె.హేమసూదన్, ఎం.గణపతిరావు, లక్ష్మీనారాయణ ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. సమావేశంలో ఆ యూనియన్ జిల్లా అధ్యక్షులు డి.సుదర్శనం, జిల్లా కోశాధికారి కె.కళ్యాణి, కాశీబుగ్గ ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు డి.ఆదిలక్ష్మి, ఎం.మంజులా కుమారి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి. తేజేశ్వరరావు, కోశాధికారి అల్లు సత్యనారాయణ, సిఐటియు జిల్లా కార్యదర్శులు ఎన్.గణపతి, ఎస్.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్క్రిప్ట్ బాబుది.. యాక్షన్ పవన్‌ది

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం రూరల్

అచ్చమైన సినీ నటుడుగానే పవన్ కళ్యాణ్ చంద్రబాబు ఇచ్చిన స్క్రిప్టును చదువుతున్నాడని, ఆ మాటలకు చప్పట్లు కొట్టిన వారంతా ఓట్లు వేయరన్న వాస్తవాన్ని ఆయన గ్రహించాలని రెవిన్యూశాఖా మంత్రి ధర్మాన ప్రసాదరావు విమర్శించారు. శ్రీకాకుళం రూరల్ మండలం వప్పంగి, సానివాడ, నగర పాలక సంస్థ పరిధిలోని పెద్దపాడు 1, 2 సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాల్లో శనివారం మాట్లాడారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులు వాలంటీర్లు అని, వారి పట్ల చంద్రబాబు అండ్ కో విషం జల్లు తున్నారన్నారు. వారి మాటలను ప్రజలు ఎంతమాత్రం విశ్వసించరన్నారు. మధ్యవర్తిత్వంలేని, అవినీతిలేని ప్రభుత్వం రాష్ట్రంలో ఉందని, ఈ ప్రభుత్వానికి ప్రజలు మరో సారి అండగా నిలిచి జగన్మోహనరెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణ, మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు వైసిపి నాయకులు అంబటి శ్రీనివాసరావు, ఎంపిపి అంబటి నిర్మల, ఎఎంసి చైర్మన్ ముకళ్ల తాత బాబు, చల్లా రవి కుమార్, అల్లు లక్ష్మి నారాయణ, పిఎసిఎస్ సభ్యులు గొండు కష్ణ, పెద్దిన ఉమా తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే నేరాల నియంత్రణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

జిల్లాలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, జిల్లాను నేర రహిత జిల్లాగా తీర్చేదిద్దేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా, ఎస్‌పి జి.ఆర్ రాధిక అధికారులకు సూచించారు. జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో పలు శాఖల ఉన్నతాధికారులు, పోలీస్ అధికారులతో ఎస్‌పి అధ్యక్షతన శనివారం నిర్వహించిన అర్ధ సంవత్సర నేర సమీక్షా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులో కుల ధ్రువీకరణ పత్రాలు త్వరితగతిన అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అంటిసిడెంట్స్ వెరిఫికేషన్ వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో ఆస్తి తగాదాల కేసులు నమోదవుతున్నాయని పోలీస్, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేసి వివక్షకు తావు లేకుండా కేసులు పరిష్కరించాలని సూచించారు. పోలీస్, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేస్తే నేర నమోదు రేటు తగ్గుతుందని తెలిపారు. భూ వివాదంలో సంబంధిత పత్రాలు క్షుణ్ణంగా పరిశీలించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు.

జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా మాట్లాడుతూ కేసుల దర్యాప్తులో కచ్చితత్వంగా ఉండాలన్నారు. అప్పుడే శిక్షల శాతం పెరుగుతుందని తెలిపారు. కేసుల విచారణలో సరైన సాక్ష్యాధారాలు, కేసు పత్రాలు సమర్పించాలన్నారు. ఎస్‌పి రాధిక మాట్లాడుతూ నేరాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణతో ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆరు నెలల్లో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయన్నారు. మహిళా భద్రతకు మహిళా పోలీసులతో క్షేత్రస్థాయిలో దిశ యాప్, మహిళా భద్రత, సైబర్ నేరాలు అరికట్టేందుకు అవగాహన కల్పిస్తూ ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. అనంతరం విభాగాల వారీగా నేరాల నియంత్రణకు, శాంతిభద్రతల పరిరక్షణకు, రోడ్డు ప్రమాదాలు, మానవ అక్రమ రవాణా నివారణ, సైబర్ మోసాలు, సిసి కెమెరాల ఏర్పాటుకు చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు. అనంతరం నేరాలు, మిస్సింగ్ కేసులు ఛేదన, కేసుల పరిష్కారం, దర్యాప్తు, సమాచారం సేకరణ, సిసి కెమెరాల ఏర్పాటు తదితర అంశాల్లో ప్రతిభ కనబరిచిన డిఎస్‌పి సిహెచ్.జి.వి ప్రసాద్, సిఐలు జి.శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు, డి.గణేష్, అలీ మహ్మద్‌కు ప్రశంసాపత్రాలను అందజేశారు. సమావేశంలో జిల్లా అటవీశాఖ అధికారి నిషాకుమారి, ఎఎస్‌పిలు టి.పి విఠలేశ్వర్, జె.తిప్పేస్వామి, డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూటర్ ఎం.నాగమల్లేశ్వరరావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు తిరుమలరావు, నాగభూషణ్, శివకుమార్, జిల్లాలోని పోలీసు అధికారులు, పలు శాఖల ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చేతకాకపోతే సెలవుపై వెళ్లండి

- భవన నిర్మాణాలపై నిర్లక్ష్యం తగదు
- నిర్లక్ష్యంగా ఉన్న ఎఇలను సస్పెండ్ చేయండి
- పిఆర్ ఇంజినీర్లపై కలెక్టర్ ఆగ్రహం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లా అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం భవనాలను మంజూరు చేస్తే వాటిని సకాలంలో ఎందుకు పూర్తి చేయలేక పోతున్నారని, నిర్లక్ష్యంగా ఉన్న ఎఇలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో లిఖిత పూర్వకంగా తెలియ జేయాలని జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ బి లఠ్కర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీరాజ్‌శాఖలో పని చేస్తున్న ఉద్యోగులతో పని చేయించడం చేతకాక పోతే తక్షణమే సెలవుపై వెళ్లాలని ఆ శాఖ సూపరిండెంట్ ఇంజినీర్ మూర్తిని ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో పంచాయతీరాజ్ శాఖ పనితీరుపై సమీక్షించారు. జిల్లాలో గ్రామ సచివాలయాలకు, హెల్త్ క్లినిక్‌లు, రైతు భరోసా కేంద్రాల నిర్మాణం పనుల్లో ఎందుకు జాప్యం జరుగుతోందని ప్రశ్నించారు. పంచాయతీరాజ్ శాఖ చేపడుతున్న భవనాలకు ప్రాధాన్యత భవనాలుగా చెప్పుకుని వాటిని ఏళ్ల తరబడి పూర్తి చేయలేక పోతే ఎలా అని ప్రశ్నించారు. క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఉంటే వాటిని తన దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. జిల్లాలో 251 గ్రామ, వార్డు సచివాలయ భవనాలు ఇప్పటివరకు ఎన్ని పూర్తి చేశారని ప్రశ్నించారు. టెక్కలి, శ్రీకాకుళం డివిజన్ల పరిధిలో ఇప్పటివరకు చేపట్టిన పనుల వివరాలు తెలపాలని కలెక్టర్ ప్రస్తావించగా ఎస్ఇ మూర్తి మౌనం దాల్చారు. దీంతో అతనిపై అసహనం వ్యక్తం చేశారు. గ్రామ వార్డు సచివాలయాల్లో 38 భవనాలు మాత్రమే పూర్తి చేశారని, ఈనెల 31లోగా మిగిలిన భవనాలన్నింటినీ పూర్తి చేసి అప్పగించాలని ఆదేశించారు. సమావేశంలో పంచాయతీరాజ్ శాఖ పర్యవేక్షక ఇంజినీర్ విఎస్ఎస్ఎన్ మూర్తి, కార్యనిర్వాహక ఇంజినీర్లు సురేష్, కుమార్ ఉప కార్యనిర్వాహక ఇంజినీర్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

మరిన్ని వార్తల కోసం
epaper.prajasakti.com

రాజ్యాంగాన్ని పరిరక్షించాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం లీగల్

మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షులు సూర్యారావు

రాజ్యాంగాన్ని పరిరక్షించాలని బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎన్ని సూర్యారావు అన్నారు. స్థానిక ఎంపిఆర్ న్యాయ కళాశాలలో ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) జిల్లా మూడో మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా 'భారత రాజ్యాంగం-సవాళ్లు' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో సూర్యారావు మాట్లాడుతూ రాజ్యాంగాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఐలు రాష్ట్ర నాయకులు ఎన్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల న్యాయవ్యవస్థకు ముప్పు వాటిల్లుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం న్యాయవాదులు భవిష్యత్‌లో పెద్దఎత్తున పోరాటాలు చేయాల్సి వస్తుందన్నారు. న్యాయవాదులపై దాడులు పెరుగుతున్నాయని, ఈ నేపథ్యంలో న్యాయవాదులకు రక్షణ చట్టం తేవాలని డిమాండ్ చేశారు. ఐలు జిల్లా అధ్యక్షులు ఎం.అప్పారావు అధ్యక్షతన నిర్వహించిన మహాసభలో ఎంపిఆర్ న్యాయ కళాశాల ప్రిన్సిపల్ మోషే, ఐలు జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రమణారావు, నాయకులు ఈశ్వరరావు, లక్ష్మీపతి, శ్రీదేవి పాణిగ్రాహి, వై.చలపతిరావు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

'ఐలు' నూతన కమిటీ ఎన్నిక

రమణారావు

అప్పారావు

మహాసభలో ఆలిండియా లాయర్స్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా దుంపల రమణారావు, ప్రధాన కార్యదర్శిగా ఎం.అప్పారావుతో పాటు 25 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

ఇంటింటా సర్వేపై అప్రమత్తం

టిడిపి జిల్లా అధ్యక్షులు రవికుమార్

ప్రజాశక్తి - పొందూరు

ఓటర్ల జాబితా రూపకల్పనలో భాగంగా చేపడుతున్న ఇంటింటా సర్వేలో అధికార పార్టీ అక్రమాలను అడ్డుకునేందుకు టిడిపి శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. స్థానిక కళ్యాణ మండపంలో టిడిపి బూత్ కన్వీనర్లతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికార పార్టీ ఓట్ల అక్రమాలపై ఫిర్యాదుతో కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఇంటింటా సర్వేను చేపడుతున్నారని చెప్పారు. ఈ సర్వేలో వాలంటీర్లు పాల్గొంటే ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయాలన్నారు. ఇంటింటికీ తిరుగుతూ టిడిపి సానుభూతిపరుల ఓట్ల తొలగింపు పరిశీలన, అధికార పార్టీ అక్రమ ఓట్ల నమోదు వంటి వాటిని నిశితంగా పరిశీలించాలని సూచించారు. ఇంటింటా సర్వేకు సంబంధించిన సమాచారాన్ని టిడిపి బూత్ కన్వీనర్లు తమ వద్ద ఉంచుకుని ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలన్నారు. వైసిపి నాయకులు అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి అక్రమంగా ఓట్ల నమోదుకు పాల్పడితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్, జిల్లా కార్యదర్శి సీపాన శ్రీరంగనాయకులు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కూన వెంకటసత్యనారాయణ, బిసి సెల్ నియోజకవర్గ అధ్యక్షులు చింతాడ కృష్ణవాసుదేవరావు, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి బలగ శంకరభాస్కరరావు, టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు గాడు నారాయణరావు, టిడిపి పట్టణ అధ్యక్షు, ప్రధాన కార్యదర్శి అనకాపల్లి శ్రీరంగ, వండాన మురళి తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధులపై ప్రత్యేక దృష్టి

- జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా
- 653 మందికి రక్త పరీక్షలు

ప్రజాశక్తి- కవిటి, కంచిలి

ప్రభుత్వం కిడ్నీ వ్యాధులపై ప్రత్యేక దృష్టిసారించి, పూర్తిస్థాయిలో నియంత్రణ చర్యలు తీసుకుంటోందని జిల్లా జడ్జి జస్టిస్ జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. కవిటి మండలం మాణిక్యపురం, కంచిలి మండలం ఎంఎస్‌పల్లిలో జిల్లా జడ్జి ఆధ్వర్యాన శనివారం వైద్య శిబిరం, న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ కిడ్నీ వ్యాధి నివారణకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత ఆరోగ్య పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. అనారోగ్యానికి గురైనవారు కచ్చితంగా కిడ్నీ పరీక్షలు నిర్వహించుకోవాలని, వ్యాధి తీవ్రతను ముందే గుర్తిస్తే మెరుగైన వైద్యంతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని అన్నారు. అంతేకాకుండా అతిగా నొప్పి నివారణ మందులు వాడడం, డాక్టర్లతో సంప్రదించకుండా మందుల దుకాణాల్లో మందులు కొనుక్కుని వాడడం ఆరోగ్యానికి ప్రమాదకరమని హెచ్చరించారు. జిల్లాలో ప్రతీ ఆరోగ్య కేంద్రంలో మెరుగైన వైద్యులు పనిచేస్తున్నారని, ఎటువంటి అనారోగ్యానికి గురైనా సంబంధిత వైద్యులను సంప్రదించాలని సూచించారు. అదనపు వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎస్.అనురాధ మాట్లాడుతూ ముందుగా కిడ్నీ వ్యాధిపై ఉన్న అపోహలు తొలగించుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వైద్య శిబిరంలో 653 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. వీరిలో సుమారు 15 మంది కొత్తగా కిడ్నీ వ్యాధికి గురైనట్టు పిహెచ్‌సి వైద్యులు భాస్కర్ తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు, సోంపేట సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు, ఇచ్ఛాపురం మెజిస్ట్రేట్ పి.పరేష్ కుమార్, నెఫ్రాలజిస్ట్ విద్యాసాగర్, కంచిలి ఎంపిపి దేవదాస్ రెడ్డి, ఎంపిడిఒ పి.సూర్యనారాయణ రెడ్డి, పిఎసిఎస్ అధ్యక్షుడు దేవరాజ్ సాహు, ప్రభుత్వ వైద్యులు డాక్టర్ రామ్‌జీ, కె.ధనలక్ష్మి, వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

వేధిస్తున్న గుబులు

టిడిపి మహానాడులో మొదటి దశ ఎన్నికల ప్రణాళికను ప్రకటించింది. ఆ తర్వాత మరికొన్ని హామీలను అధినేత చంద్రబాబు నాయుడు ప్రకటిస్తూ వస్తున్నారు. చంద్రబాబు హామీలపై సంక్షేమ పథకాలపై విముఖత చూపిస్తున్న వారు టిడిపి తీరును వ్యతిరేకిస్తున్నారని కొందరు వైసిపి నేతలు చెప్తున్నారు. కొత్త హామీలను గుప్పిస్తున్న చంద్రబాబు, ఉన్న సంక్షేమ పథకాలను కొనసాగిస్తారో? ఎత్తివేస్తారో? స్పష్టం చేయడం లేదు. జగన్ తొలిసారి హామీలు ఇచ్చారు కాబట్టి ప్రజలు నమ్మారు. చంద్రబాబుకు ఆ అవకాశం లేదు. ఐదేళ్ల పాలనలో ఏం చేశారో ప్రజలకు అనుభవమైంది. అందువల్ల చంద్రబాబు ఎన్ని హామీలు ఇచ్చినా ప్రజలు విశ్వసించరని వైసిపి నేతల నుంచి విస్తృత ప్రచారం సాగుతోంది. ఈ ప్రచారాన్ని ఎదుర్కొని ప్రజలు తమవైపు తిరిగేలా, తిరిగి చంద్రబాబును విశ్వసించేలా జిల్లాలో టిడిపి ఎలాంటి కార్యక్రమాన్ని తీసుకున్నట్లు కనిపించడం లేదు. ముఖ్యంగా చంద్రబాబు మాటపై ప్రజల్లో ఎలా విశ్వసనీయత పెంచాలన్న ఆలోచన టిడిపిలో కనిపించడం లేదు. వైసిపి ప్రభుత్వ దుర్మార్గ పాలనపై ప్రజలు తిరగబడతారని, ఆ వ్యతిరేకత అంతా తమవైపే ఓట్లరూపంలో మళ్లుతుందన్న ఆశల్లో టిడిపి అధినేతతో పాటు జిల్లా నేతలు ఉన్నట్లు కనిపిస్తోంది. జిల్లాలో టిడిపిలో ఆయా నియోజకవర్గాల్లో గ్రూపుల గోల ఉంది. పార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా అచ్చెన్నాయుడు ఉన్నా, జిల్లా నాయకునిగా ఆయన్ను గుర్తించే పరిస్థితి లేదని ఆ పార్టీ నేతలే చెప్తున్నారు.

జిల్లా అధ్యక్షులుగా ఉన్న కూన రవికుమార్ కూడా జిల్లాలో పార్టీపై గట్టి పట్టు సాధించినట్లు కనిపించడం లేదు. అలాంటి కార్యక్రమాలు కూడా కనిపించడం లేదు. ప్రత్యర్థుల బలహీనతలే తమ బలం అనుకున్నంత కాలం అది మరింత బలహీనతకు దారితీస్తుందన్నది జిల్లా రాజకీయాల చరిత్ర చెప్తోంది. సొంత బలాన్ని పెంచుకోకుండా, పోయిన విశ్వాసాన్ని తిరిగి ప్రజల నుంచి పొందనంత కాలం రాజకీయ శక్తుల బలాబలాల్లో ఎలాంటి మార్పులు ఉండవన్నది జిల్లా చరిత్ర కూడా చెప్తోంది. ఇప్పటికే వైసిపి, టిడిపి, జనసేన బిజెపిని అంటిపెట్టుకుని ఉన్నాయన్నది ఆ పార్టీల నడక చెప్తోంది. జిల్లా రాజకీయాల్లో మార్పులు రావాలంటే కమలం పార్టీని అన్ని విధాలుగా దూరం చేసుకున్న వారికే జిల్లాలోనూ రాజకీయ భవిష్యత్ ఉంటుంది. అది జిల్లా అభివృద్ధికి మూలమవుతుంది. లేదంటే ప్రత్యామ్నాయ శక్తులు దూసుకొస్తాయి. జిల్లాలోనూ సరికొత్త రాజకీయాలను తెర పైకి తీసుకొచ్చే వాతావరణం ముంచుకొస్తుంది. జిల్లా ప్రజలకూ దిగులు, గుబులు అప్పుడే మాయమవుతుంది.

\- సత్తారు భాస్కరరావు

అలసత్వం వహిస్తే చర్యలు

జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

విధి నిర్వహణలో అధికారులు అలసత్వం వహిస్తే చర్యల తప్పవని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ హెచ్చరించారు. స్థానిక ఆదిత్య కళ్యాణ మండపంలో టెక్కలి, పలాస రెవెన్యూ డివిజన్ల పరిధిలోని తొమ్మిది మండలాల తహశీల్దార్లు, రీసర్వే అర్‌ఐలు, ల్యాండ్ రికార్డ్స్ సిబ్బంది, విఆర్‌ఒలు, రెవెన్యూ సిబ్బందితో భూ సమగ్ర రీసర్వేపై శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వే వేగవంతం చేయాలని ఆదేశించారు. లేకుంటే విధుల నుంచి స్వచ్ఛందంగా తప్పుకోవాలన్నారు. అనంతరం మండలాల వారీగా భూ రీ సర్వే అంశాలపై ప్రగతిని పరిశీలించారు. రీ సర్వే అంశాల్లో వెనుకబడి ఉన్న పలువురు రెవెన్యూ సిబ్బందిపై జెసి అసహనం వ్యక్తం చేశారు. సమావేశంలో టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి, పలాస ఆర్‌డిఒ టి.సీతారామ్మూర్తి, తహశీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెసి నవీన్

31న కలెక్టరేట్ వద్ద ఎండిఎం కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు నెలకు రూ.10వేలు వేతనం చెల్లించడంతో పాటు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచాలని మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు అల్లు మహాలక్ష్మి డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ఈనెల 31న కలెక్టరేట్ వద్ద కార్మికులు చేపడుతున్న ధర్నాలో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నగరంలోని సిఐటియు కార్యాలయంలో యూనియన్ జిల్లా సర్వసభ్య సమావేశం కె.సుశీల అధ్యక్షతన శనివారం నిర్వహించారు.

ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.సుశీల, బి.ఉత్తరతో కలిసి మాట్లాడారు. 20 ఏళ్లుగా మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం కార్మికులుగా గుర్తించకుండా పని చేయించుకుంటోందన్నారు. కనీస వేతనాలు అమలు చేయాలని, పిఎఫ్, ఇఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. వంటగ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. కార్మికులకు యూనిఫామ్, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించవద్దని డిమాండ్ చేశారు.

పోరాడి సాధించుకున్నారు

కుదిరిన 'రాజ్యలక్ష్మి పోల్స్' వేతన ఒప్పందం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

శ్రీ రాజ్యలక్ష్మి పోల్స్ కార్మికులు పోరాడి విజయం సాధించారు. పొందూరు మండలం రాపాక వద్ద గల శ్రీ రాజ్యలక్ష్మి పోల్స్ కార్మికులకు, యాజమాన్యానికి మధ్య నగరంలోని ఒక హోటల్‌లో శనివారం వేతన ఒప్పందంపై చర్చలు జరిగాయి. కార్మికులకు తాము అండగా నిలుస్తున్నట్టు తెలిపారు. ఈ చర్చలలో యాజమాన్య ప్రతినిధి పి.రాజశేఖర్, శ్రీ రాజ్యలక్ష్మి పోల్స్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కర్నేని గోవిందరావు, పి.అప్పలనాయుడు నాయుకులు సిహెచ్.కోదండరావు, ఇ.రాము తదితరులు పాల్గొన్నారు. పోరాట ఫలితంగా విజయం సాధించిన రాజ్యలక్ష్మి పోల్స్ కార్మికులకు సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, జిల్లా కార్యదర్శి ఎన్.వి రమణ అభినందనలు తెలిపారు.

మహారాజశ్రీ గౌరవనీయులైన 3వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు గాజువాక
D.V.C. 12 / 2019
Between:
శ్రీమతి బోడ్డేపల్లి రాజ్యలక్ష్మి వగైరాలు ... వాదులు
And:
బోడ్డేపల్లి శ్రీనివాసరావు వగైరాలు . . .ప్రతివాదులు
రెండు నుంచి నాలుగువ ప్రతివాదికి నోటీసులు
ఆర్-2: బోడ్డేపల్లి అప్పారావు, బోడ్డేపల్లి గ్రామం, మాడవలస పోస్టు, పొందూరు మండలం, శ్రీకాకుళం జిల్లా.
ఆర్-3: బోడ్డేపల్లి వరలక్ష్మి, భర్త అప్పారావు బోడ్డేపల్లి గ్రామం, మాడలవలస పోస్టు, పొందూరు మండలం, శ్రీకాకుళం జిల్లా.
ఆర్-4: బోడ్డేపల్లి వాసుదేవరావు, తండ్రి అప్పారావు, బోడ్డేపల్లి గ్రామం, మాడలవలస పోస్టు, పొందూరు మండలం, శ్రీకాకుళం జిల్లా.
యిందుమూలంగా మీకు తెలియజేయునది ఏమనగా పై కేసులో 2 నుంచి 4రు ప్రతివాదులు అయిన మీరు హాజరు నిమిత్తం తేది: 27-7-2023 వాయిదా వేసినారు. కావున యీ ప్రకటన నోటీసుగా భావించి పై తేదీన పై కోర్టు వారి ఎదుట ఉదయం గం. 10-30 ని॥లకు స్వయంగా గాని ప్లీడరు ద్వారా గాని హాజరై వాదన చేసుకోవలెను. లేనిచో పై కేసులో మీకు వాదన లేదని భావించి మీ పరోక్షమున తీర్మానించెదురు.
(బై ఆర్డర్)
K.V.SWAMY
Advocate, Chaitanyanagar,
Old Gajuwaka, Visakhapatnam-26.
Cell : 9948295935

ఫైరింగ్ చేస్తున్న ఎస్‌పి రాధిక

గురి లక్ష్యం వైపు ఉండాలి

ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

అర్ధ వార్షిక ఫైరింగ్ సాధన ప్రక్రియలో భాగంగా ఎచ్చెర్ల జిల్లా ఆర్మ్ రిజర్వు పోలీసు కార్యాలయం పరిధిలోని చిన్నరావుపల్లి ఫైరింగ్ రేంజ్‌లో జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న పోలీసులకు, సిబ్బందికి ఫైరింగ్ సాధన ప్రక్రియ శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్‌పి జి.రాధిక పాల్గొని స్వయంగా పాల్గొని ఫైరింగ్ ప్రాక్టీస్ చేసి అధికారులలో ఉత్సాహాన్ని, మనోధైర్యాన్ని నింపారు. ఈ క్రమంలో ముందుగా ఫైరింగ్ సాధన కోసం ఉయోగించే అయధాలను క్షుణ్ణంగా పరిశీలించారు. వార్షిక ఫైరింగ్ జరగుతున్న నేపథ్యంలో ఫైరింగ్‌లో ప్రతి ఒక్కరూ పాల్గొని మంచి మెళకువలు నేర్చుకోవాలన్నారు. అందులో అనుమానాలు ఉంటే వాటిని నివృత్తి చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్క బుల్లెట్టు టార్గెట్ వైపే బుల్ పడేవిధంగా తర్ఫీదు పొందాలని సూచించారు. అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని పోలీస్‌శాఖ ఉన్నతి కోసం ముందడుగు వేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పిలు టి.పి.విఠలేశ్వరరావు, జె.తిప్పేస్వామి, డిఎస్‌పిలు, సిఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని బలగ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ఆదివారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు డే అండ్ నైట్ కూడలి నుంచి ఆదివారంపేట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఇఇ సత్తారు బయ్యన్నాయుడు, డి-2 ఎఇ జె.సురేష్ కుమార్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డు కిరువైపులా చెట్లను తొలగించడానికి వీలుగా కాలేజ్ రోడ్, ఆర్‌టిసి కాంప్లెక్స్ ఏరియా, పొడుగు నారాయణమ్మ కాలనీ, ఆంధ్రాబ్యాంకు ఏరియా, బలగ, ఆస్పత్రి కూడలి, మడ్డి వీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఆమదాలవలస : ఈ నెల 23న విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సత్తారు బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త రోడ్డు ప్రాంతంలో రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్న నేపథ్యంలో విద్యుత్ స్తంభాలు, తీగలు మార్పు చేస్తున్నామని అన్నారు. ఉదయం పది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు కొత్త రోడ్డు, గోపీనగర్, తోటాడ, అక్కివరం తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని తెలిపారు. ఈ అసౌకర్యాన్ని ప్రజలు గమనించి కోరారు.

శివారు భూములకూ సాగునీరు

జలుమూరు: మండలంలోని శివారు భూములకూ సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వంశధార సబ్ డివిజన్ డిఇ బి.శ్రీహరి తెలిపారు. మండలంలోని రానా కూడలి వద్ద వంశధార ప్రధాన కాలువ నుంచి పిల్ల కాలువకు శనివారం నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు పొదుపుగా నీటిని వాడుకోవాలని సూచించారు. ఎఇఇలు ఎం.వి.సురేష్‌కుమార్, కె.వి.రమణమూర్తి, లస్కర్లు పాల్గొన్నారు.

నీటిని విడుదల చేస్తున్న శ్రీహరి

'జగనన్న సురక్ష'తో సేవలు సరళతరం

ప్రజాశక్తి- ఆమదాలవలస

జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజలకు సేవలు సరళతరం కానున్నాయని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని కనుగులవలసలో శనివారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1902 జగనన్నకు చెబుదాం కార్యక్రమం సత్ఫలితాలను ఇచ్చిందని అన్నారు. దానికి అనుసంధానమే జగనన్న సురక్ష అని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నెల రోజులపాటు జగనన్న సురక్ష నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎటువంటి ఫీజు వసూలు చేయకుండా 11 రకాల ధ్రువపత్రాలను ప్రజలకు ఉచితంగా అందిస్తున్నామని అన్నారు. సంక్షేమ పథకాలతో సిఎం జగన్ ప్రజల మనసులలో చెరగని ముద్ర వేసుకున్నారని అన్నారు. అనంతరం ధ్రువపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎస్.గణపతి, ఎంపిడిఒ ఎస్.వాసుదేవరావు, ఎంపిపి ప్రతినిధి తమ్మినేని శ్రీరామ్మూర్తి, పిఎసిఎస్ అధ్యక్షుడు గురుగుబిల్లి శ్రీనివాసరావు, డిసిసిబి డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు, సచివాలయాల కో-ఆర్డినేటర్ నిరంజన్ బాబు, ఎంపిటిసి పొన్నాడ అనసూయమ్మ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : జగనన్న సురక్షతో ప్రజా సమస్యలు పరిష్కారమౌతాయని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. మండలంలోని లొద్దపుట్టి సచివాలయంలో నిర్వహించిన జగనన్న సురక్షలో పాల్గొని 11 రకాల ధ్రువపత్రాలను అందజేశారు. సీడాప్ చైర్మన్ శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఎంపిపి బోర పుష్ప, మండల జెసిఎస్ అధ్యక్షులు ఆశి పురుషోత్తం, సర్పంచ్ ఆశి సులోచనరెడ్డి, కారంగి మోహనరావు, ఆశి దాలయ్య రెడ్డి, తహశీల్దార్ గురుప్రసాద్ పాల్గొన్నారు.

కవిటి : ధ్రువపత్రాన్ని అందజేస్తున్న విజయ, రామారావు

నరసన్నపేట : మండలంలోని మాకివలస పంచాయతీలో నిర్వహించిన జగనన్న సురక్షలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ పాల్గొని వివిధ రకాల ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

కొత్తూరు : మండలంలోని మెట్టూరు బిట్-2, మాతల సచివాలయంలో నిర్వహించిన జగనన్న సురక్షలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి 11 రకాల ధ్రువపత్రాలను అందజేశారు. జెడ్‌పిటిసి కె.భార్గవి, ఎంపిడిఒ ఎం.పావని, పిఎసిఎస్ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణ, వైసిపి మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, సర్పంచ్‌లు వై.ధర్మారావు, కుంచాల రత్నాలు, నాన బాలకృష్ణ, వైకుంఠరావు, జి.ఆనంద రావు, బి.శ్రీను, కె.త్రినాథరావు, దాశి అప్పన్న పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని వెంకటాపురం సచివాలయం, బందపల్లిలో నిర్వహించిన జగనన్న సురక్షలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి పాల్గొని వివిధ రకాల ధ్రువప్రతాలను అందజేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి గూడ ఎండయ్య ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్ కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు బాలరాజు, వైసిపి మండల కన్వీనర్ పల్లి యోగి, తహశీల్దార్ పి.సరోజని, ఇఒపిఆర్‌డి తారకేశ్వరి, మండల ఎఒ దాణకర్ణుడు, ఎపిఎం లలిత, సర్పంచ్‌లు బి.జయమ్మ, గూడ వసంతకుమారి పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : మండలంలోని మేఘవరం, అక్కివలస సచివాలయాల వద్ద నిర్వహించిన జగనన్న సురక్షలో కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి 11 రకాల ధ్రువపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, జెడ్‌పిటిసి పాల వసంతరెడ్డి, వైస్ ఎంపిపి ప్రతినిధి నక్క భీమారావు, మండల వైసిపి కన్వీనర్ కోత సతీష్, సర్పంచ్‌లు పరపటి సునీతారెడ్డి, శ్రీరంగం వీరాస్వామి, ఎంపిటిసిలు సూరాద రాజారావు, బొంగు కొండయ్య, మరువాడ వైసిపి ఇన్‌ఛార్జి గంట ఈశ్వరరావు, కార్యదర్శులు కె.వివిధ్య, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలోని నీలంపేట సచివాలయం వద్ద సర్పంచ్ మెట్ట ఈశ్వరమ్మ, మెట్ట సింహాచలం, లలితాంబ, బొడ్డు లక్ష్మి ఆధ్వర్యాన నిర్వహించిన జగనన్న సురక్షలో ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావులు పాల్గొని వివిధ రకాల ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, పేడాడ వెంకటరావు, మండల ప్రత్యేకాధికారి లోకనాథం, డిటి, ఆర్.మధు, ఇఒపిఆర్‌డి చైతన్య, హౌసింగ్ ఎఇ రెడ్డి పాపినాయుడు, మెట్టు వాసు పాల్గొన్నారు.

కవిటి : మండలంలోని కపాసుకుద్దిలో సర్పంచ్ కాయ దమయంతి అధ్యక్షతన నిర్వహించిన జగనన్న సురక్షలో జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు పాల్గొని వివిధ రకాల ధ్రువపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్, ఎఎంసి వైస్ చైర్మన్ యలమంచి నీలయ్య, టెంఢాళం జయప్రకాష్, పులకల శ్రీరాములు, కాయ భీమసేన్, పూడి నీలాచలం, డిటి రామచంద్రరావు పాల్గొన్నారు.

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం-1 సచివాలయ పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్షలో ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పాల్గొని 11 రకాల ధ్రువపత్రాలను అందజేశారు. మండల ప్రత్యేక అధికారి డాక్టర్ దుర్గారావు, తహశీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్, ఎంపిడిఒ రమణమూర్తి, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పలాస : మున్సిపాలిటీ పరిధిలోని న్యూ కాలనీ, సీతానగర్‌లో నిర్వహించిన జగనన్న సురక్షలో చైర్మన్ బల్ల హరిబాబు పాల్గొని 11 రకాల ధ్రువపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బోర కృష్ణారావు, విప్ దుర్గా శంకర్‌పండా, పలాస ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీర్ భవానీశంకర్, కౌన్సిలర్ ప్రసాద్, వాణిజ్య విభాగ అధ్యక్షులు బెల్లాల శ్రీనివాసరావు, సనపల సింహాచలం, కమిషనర్ టి.నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

ఆమదాలవలస : ధ్రువపత్రాన్ని అందజేస్తున్న స్పీకర్ సీతారాం

టెక్కలి రూరల్ : టెక్కలి 3,4 సచివాలయాల్లో నిర్వహించిన జనగన్న సురక్షలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి దువ్వాడ వాణి పాల్గొని ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డిటి.ఎస్.రవికుమార్, సర్పంచ్ గొండెలి సుజాత, కార్యదర్శి కూన వినోద్ కుమార్‌పాల్గొన్నారు.

జి.సిగడాం : మండలంలోని వెలగాడ, నిద్దాం గ్రామాల్లో నిర్వహించిన జగనన్న సురక్షలో మండల ప్రత్యేక ఆహ్వానితులు మీసాల వెంకటరమణ, జెడ్‌పిటిసి కాయల రమణ పాల్గొని ధ్రువపత్రాలను అందజేశారు. సర్పంచ్ భూపతి సురేష్, బొల్ల జనార్ధనరావు, ఎంపిడిఒ కె.నిశ్చెల, తహశీల్దార్ పప్పల వేణుగోపాలరావు పాల్గొన్నారు.

జలుమూరు: మండలంలోని మర్రివలస, నగిరికటకం సచివాలయాల్లో నిర్వహించిన జగనన్న సురక్షలో పోలాకి జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య, ఎంపిపి వాన గోపి పాల్గొని ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి తంగి మురళీకృష్ణ, మండల వైసిపి కన్వీనర్ కనుసు సీతారాం, మండల సలహాదారుడు విఠల్‌రావు, బి.లక్ష్మణరావు, తహశీల్దార్ బి.సత్యం, ఎంపిడిఒ ఎల్.వి.అప్పారావు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : ధ్రువపత్రాన్ని అందజేస్తున్న కృపారాణి

ఇసుక అక్రమ రవాణా అడ్డగింత

ఇసుక లారీలను అడ్డుకున్న మాజీ ఎమ్మెల్యే రమణమూర్తి

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని మాతల-నివగాం వంతెన సమీపంలోని వంశధార నది నుంచి అక్రమంగా తరలిస్తునన ఇసుక రవాణాను మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ శనివారం అడ్డుకున్నారు. ఈ నెల 22న 'ఒడిశాకు అక్రమంగా ఇసుక తరలింపు' అనే కథనం 'ప్రజాశక్తి'తో ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన ఆయన తన అనుచరులతో వెళ్లి వాహనాలను అడ్డుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అక్రమంగా ఇసుకను అమ్ముకుంటున్నారని విమర్శించారు. గతంలో నిలుపుదల చేసిన నివగాం ఇసుక ర్యాంపును ఎమ్మెల్యే ఒత్తిడి వల్లే మళ్లీ ప్రారంభించారని అన్నారు. ఢిల్లీ నుంచి ఇక్కడకు వచ్చి మంచి పరిపాలన అందిస్తారని ప్రజలు ఎమ్మెల్యేగా గెలిపిస్తే... అక్రమంగా ఇసుకను అమ్ముకోవడం ఏమిటని ప్రశ్నించారు. ఇచ్చిన అనుమతులు కన్న మించి 15 నుంచి 20 మీటర్ల లోతు వరకు ప్రొక్లెయినర్‌తో తవ్వడంతో భూగర్భ జలాలు ఇంకిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 20 ఎకరాలు విస్తీర్ణంలో ఇసుక డంపింగ్ చేసుకుంటూ లారీల్లో ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారని అన్నారు. నది నుంచి ఇసుక వంశధార కరకట్ట పైనుంచి రవాణా చేస్తుంటే కరకట్ట కొట్టుకుపోయే ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే అయితే నివగాం, మదనాపురం, సోమరాజపురం గ్రామాలు వరదల సమయంలో మునిగిపోయే ప్రమాదం ఉందన్నారు. అలాగే వందలాది లారీలు అధిక లోడ్లతో వెళ్లడం వల్ల గులుమూరు-నివగాం రోడ్డు శిథిలావస్థకు చేరుకుని గోతులమయమవుతుందన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాలు ప్రకారం ఇసుక రవాణా చేయాలని, లేకుంటే ఇసుక ర్యాంపును మూసి వేయాలని అన్నారు. ఈయన వెంట మదనాపురం మాజీ సర్పంచ్ అగతముది మాధవరావు, నివగాం మాజీ ఎంపిటిసి బూరాడ నీలంనాయుడు ఉన్నారు.

అభినందనలు తెలుపుతున్న నాయకులు

సాగర మత్స్యకార సొసైటీ అధ్యక్షునిగా లక్ష్మణరావు

వజ్రపుకొత్తూరు: మండలంలోని దేవునల్తాడ సాగర్ మత్స్యకార సొసైటీ అధ్యక్షులుగా అంబటి లక్ష్మణరావును సొసైటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామంలో సర్పంచ్ అధ్యక్షతన నిర్వహించిన శనివారం నిర్వహించిన సమావేశంలో వైసిపి మద్దతుదారుడైన లక్ష్మణరావును సొసైటీ సభ్యులు అందరూ ప్రతిపాదించడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైంది. అలాగే సొసైటీ కార్యదర్శిగా నందుపల్లి తులసీరావును ఎన్నుకున్నారు. గతంలో ఈ సొసైటీకి అధ్యక్షులుగా పనిచేసిన వాసుదేవరావు అకాల మరణంతో సొసైటీ అధ్యక్ష పదవి ఖాళీ అయింది. రాష్ట్ర మంత్రి సీదిరి అప్పలరాజు ఆదేశంతో సొసైటీకి పూర్తిస్థాయి అధ్యక్షులు ఉండాలనే ఉద్దేశంతో ఎన్నికలు నిర్వహించినట్లు వారు తెలిపారు. వీరికి సర్పంచ్ వరదరాజులు, మాజీ సర్పంచ్ సీదిరి చిరంజీవి, ఎంపిటిసి వెంకన్న, సొసైటీ సభ్యులు అభినందనలు తెలిపారు.

అప్పల బాధతో వలస కూలీ ఆత్మహత్య

ఆన్‌లైన్ గేమ్ కారణమంటున్న గ్రామస్తులు

ప్రజాశక్తి- సోంపేట

వేణు (ఫైల్)

మండలంలోని సుంకిడి పంచాయతీ వల్లభరాయపురానికి చెందిన వలస కూలీ గోకర్ణ వేణు (23) శనివారం హైదరాబాదులో ఉరిపోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వల్లభరాయపురానికి చెందిన వేణు గ్రామంలో భార్య, ఏడాది వయసున్న కుమారుడు తల్లిదండ్రులతో జీవనం సాగిస్తున్నాడు. హైదరాబాదులో వలస కూలిగా వెళ్లి భవన కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబ పోషణ చేస్తున్నాడు. ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై గాయాల పాలయ్యాడు. ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసై విపరీతంగా అప్పులు చేశాడని, అప్పుల ఒత్తిడి తాళలేక హైదరాబాదులో ఆత్మహత్యకు పాల్పడినట్లు సూసైడ్ నోట్లో రాసి చనిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. మతదేహం స్వగ్రామానికి ఆదివారం రానున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

మహిళ అరెస్టు

జలుమూరు: మండలంలోని శ్రీముఖలింగంలో విక్రయానికి సిద్ధంగా ఉంచిన గంజాయిని పట్టుకున్న కేసులో ఏడో నిందితురాలు ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా బొమ్మికకు చెందిన బృందావతీ రౌలోను శుక్రవారం రాత్రి అరెస్టు చేసినట్లు ఎస్ఐ పి.పారినాయుడు శనివారం తెలిపారు. శ్రీముఖలింగంలో గంజాయి పట్టుకున్న కేసులో ఏడుగురు నిందితులు ఉండగా, ఆరుగురిని అప్పుడే అరెస్టు చశామని తెలిపారు. బృందావతి రౌలోను కోటబొమ్మాళి కోర్టులో హాజరు పరచగా, రిమాండ్ విధించినట్లు తెలిపారు. అనంతరం శ్రీకాకుళం జిల్లా జైలుకు తరలించామని అన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న సభ్యులు

దాడులకు పాల్పడిన వారిని శిక్షించాలి

టెక్కలి : ఒంగోలు జిల్లా మంగళగిరిలో గిరిజన బాలికలపై అత్యాచారం చేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని సమతా సైనిక జిల్లా కార్యదర్శి చల్లా రామారావు డిమాండ్ చేశారు. సమతా సైనిక దళ్ జిల్లా శాఖ ఆధ్వర్యాన స్థానిక అంబేద్కర్ కూడలి వద్ద శనివారం కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజన బాలికలపై జరుగుతున్న ధమనకాండపై మహిళాసంఘాలు సుమోటాగా కేసులు నమోదు చేయాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టి కేసులో నమోదు చేసి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి కుప్పిలి కామేశ్వరరావు, దేవాది సునీత, సామ దామోదరరావు, పిలక చంటి, అక్కురాడ మాధవరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శ్రీధర్

మెళకువలతోనే అధిక దిగుబడులు

బూర్జ: రైతులు వ్యవసాయ, ఉద్యానవనశాఖ అధికారుల సూచనలను, మెళకువలను పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయశాఖ జెడి కె.శ్రీధర్ అన్నారు. మండలంలోని పెద్దపేట వద్ద ఉన్న ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో డాక్టర్ వైఎస్ఆర్ పొలంబడి శిక్షణ శనివారం ఇచ్చారు. కార్యక్రమంలో 60 మంది రైతులు పాల్గొన్నారు. అనంతరం పొలంబడి విధి విధానాలు, ఆచరించాల్సిన పద్ధతులు వివరించారు. గ్రూప్‌లుగా విభజించి విత్తన శుద్ధి, ప్రీ బ్యాలెట్ బాక్స్ పరీక్ష, మట్టి నమూనా సేకరణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ త్రినాథస్వామి, ఎపి టిడ్కో డైరెక్టర్ కె.గోవిందరావు, వ్యవసాయ సహాయ సంచాలుకులు బి.రాజగోపాలరావు, డిఆర్‌సి పీడీ కె.కృష్ణారావు, హార్టికల్చర్ సీనియర్ సైంటిస్టు భగవాన్, ఎఫ్‌టిసి ఎఒ సూర్యకుమారి, మండల ఎఒ వి.రాజేశ్వరరావు, హార్టికల్చర్ అధికారి బి.అయింతి, ఎఫ్‌పిఒ సిఇఒ గణేష్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సిహెచ్.చిన్నమ్మడు, సూర్యనారాయణ, గోవిందరెడ్డి, విఎఎలు హేమలత, జగదీష్, పోలరాజు పాల్గొన్నారు.

బోయ, వాల్మీకులను ఎస్‌టిల్లో చేర్చవద్దు

మాట్లాడున్న కృష్ణయ్య

ప్రజాశక్తి - టెక్కలి

రాష్ట్రంలోని బోయ, వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చవద్దని, అలా చేస్తే గిరిజనులకు తీవ్ర అన్యాయం చేసిన వారవుతారని మేథావులు అభిరపాయపడ్డారు. కుల నిర్మూలనా పోరాట సమితి జిల్లా ఆధ్వర్యాన అంబేద్కర్ భవన్‌లో శనివారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సిఐటియు నాయకులు నంబూరి షణ్ముఖరావు, కెఎన్‌పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మిస్కా కృష్ణయ్య మాట్లాడుతూ గతంలో చంద్రబాబు ప్రభుత్వం ప్రతిపాదనను భారత్ రిజిస్ట్రార్ జనరల్ తిరస్కరించిందని గుర్తు చేశారు. రాయలసీమలో అత్యధికంగా ఉన్న బోయలను సంతృప్తి పరచడానికి జగన్ ప్రభుత్వం శ్యాముల్ ఆనంద్ కమిషన్ పేరుతో మరోసారి ఎస్‌టిలను దగా చేయడానికి జరుగుతున్న కుట్రలకు వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. డిటిఎఫ్ నాయకులు కోత ధర్మారావు మాట్లాడుతూ మణిపూర్‌లో ఆదివాసీ క్రిస్టియన్లపై జరుగుతున్న దాడులు దారుణమన్నారు. స్త్రీలపై అత్యాచారాలు చేస్తూ నగ్నంగా చేసి ఊరేగించడం లాంటి చర్యలు మూడు నెలలుగా జరుగుతున్న కేంద్రంలోని డబుల్ ఇంజిన్ సర్కార్ మారణ హోమానికి ఆజ్యం పోస్తుందని అన్నారు. ఆదివాసీ మహిళను రాష్ట్రపతి చేశామని చంకలు గుద్దుకొంటున్న మోడీ... మణిపూర్‌లో జరుగుతున్న ఘోరంపై రాష్ట్రపతి మాట్లాడకపోవడం చారిత్రిక తప్పిదమని అన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ చైతన్య వేదిక జిల్లా కన్వీనర్ సలాసన షణ్ముఖరావు, ఆల్ ఇండియా గిరిజన సమైఖ్య ఎపి వైస్ చైర్మన్ గేదెల రమణమూర్తి, బి.తిరుపతిరావు, నాగరాజు, కూర్మారావు, బి.ప్రభాకరరావు, ప్రగతిశీల కార్మిక సంఘం నాయకులు కోళ్ల పాపారావు, ప్రజాకళా మండలి నాయకులు గంగయ్య, మందస ఆదివాసీ నాయకులు సవర సోమలయ్య, సిపిఐ నాయకులు షణ్ముఖరావు పాల్గొన్నారు.

'హెక్సేర్ టెక్నాలజీస్'కు 111 మంది ఎంపిక

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు తమ సత్తాచాటి చైన్నయ్ కేంద్రంగా పనిచేస్తున్న సాఫ్ట్‌వేర్ కంపెనీ హెక్సేర్ టెక్నాలజీస్‌లో ఉద్యోగాలకు 111 మంది ఎంపికయ్యారని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు కళాశాల ఆవరణలో విద్యార్థులను శనివారం అభినందించారు. హెక్సేర్ కంపెనీ ఐతమ్‌లో నిర్వహించిన ప్రాంగణ ఉద్యోగ ఎంపికలో ఇసిఇ, సిఎస్ఇ, ఇఇఇ, ఐటి విద్యార్థులు వాత, మౌఖిక పరీక్షల్లో తమదైనశైలిలో ప్రతిభ కనపరచి 111 మంది ఒకేసారి భారీ ఎత్తున ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. 2023లో బిటెక్ కోర్స్ పూర్తి చేసిన వివిధ బ్రాంచ్‌లకు చెందిన 111 మంది విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. ఒక్కొక్కరికీ వార్షిక వేతనంగా రూ. 4 నుంచి 6 లక్షల వరకు చెల్లించేందుకు అంగీకరించినట్లు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, ఇసిఇ హెచ్‌ఒడి డాక్టర్ బి.రామారావు, సిఎస్ఒ హెచ్ఐడి డాక్టర్ యు.డి.ప్రసన్న, ఇఇఇ హెచ్‌ఐడి డాక్టర్ కె.కిరణ్‌కుమార్, ఐటి హెచ్ ఒడి డాక్టర్ వై.రమేష్, ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ ఎం.ఎన్.వి.ఎస్.ఎస్.కుమార్ పాల్గొన్నారు.

ఎంపికైన విద్యార్థులతో ఐతమ్ డైరెక్టర్ నాగేశ్వరరావు

'జ్ఞానభారతి'లో జాతీయ పతాక ఆవిష్కరణ


మార్చ్ డ్రిల్‌ను నిర్వహిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పట్టణంలోని జ్ఞాన భారత్ విద్యా సంస్థలో జాతీయ పతాక ఆవిష్కరణ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. సిబిఎస్ఇ జ్ఞానభారతి పాఠశాలలో 'భారత రాజ్యాంగం-22 జూలై 1947లో ఆమోదించిన 'జాతీయ జెండా విశిష్టతను' గురించి విద్యా సంస్థల కార్యదర్శి జోహార్ ఖాన్ వివరించారు. పాఠశాల విద్యార్థులకు జెండా గొప్ప తనాన్ని, విశిష్ట తను తెలిపి, పిల్లలకు దేశంపై భక్తి భావాలను పెంపొందించే సందేశాలను ఇచ్చారు. జెండాను గౌరవ ప్రథంగా చేపట్టి, మార్స్ డ్రిల్స్ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఎగ్జిక్యుటివ్ ట్రస్టు వి.రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఐ.బి.పండా, రషీదాసుల్తానా, ఎఒ ప్రేమ్ సర్తాజ్‌ఖాన్, మేనేజర్ ప్రమోద్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

37 కేసులు పరిష్కారం

మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా కోర్టులో శనివారం నిర్వహించిన ప్రత్యేక అదాలత్‌లో 37 రోడ్డు ప్రమాద, భూసేకరణ వివాదాల కేసులు పరిష్కరించినట్లు ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. న్యాయవాదులు, వివిధ శాఖాధికారులు తమ వద్ద పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి రాజీ కుదిర్చామన్నారు. ఈ అదాలత్‌కు ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా అదనపు, ఫ్యామిలీ కోర్టు జడ్జి భాస్కరరావు, న్యాయవాది వారణాసి జగన్నాథరావు వ్యవహరించారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్ని సూర్యారావు, మోటార్ ఇన్సిడెంట్ స్టాండింగ్ కౌన్సిల్ మంచు జనార్ధనరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

నియమ నిబంధనలు తప్పనిసరి

పొందూరు : ప్రయాణ సమయంలో వాహనదారులు నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని జూనియర్ సివిల్ జడ్జి బి.జోత్స్న అన్నారు. పొందూరు జ్యుడిషియల్ ఫస్టుక్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో స్పెషల్ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌టిసి 40 కేసులు, మూడు మోటార్ వెహికల్ కేసులను పరిష్కరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు బ్రహ్మాజీ, కె.రమణమూర్తి, కిరణ్, రఘుబాబు, కృష్ణారావు, రామ్మోహన్, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

పొందూరు : మాట్లాడుతున్న న్యాయమూర్తి జ్యోత్స్న

మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టాలి

జిఆర్‌పి లైన్స్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటరావు

సూచనలు ఇస్తున్న వెంకటరావు

ప్రజాశక్తి- ఆమదాలవలస

రైళ్లలో రవాణా అయ్యే మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టాలని జిఆర్‌పి లైన్స్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వెంకటరావు ఆదేశించారు. శ్రీకాకుళం రోడ్డు రైల్వేస్టేషన్‌లోని జిఆర్‌పి పోలీస్ స్టేషన్‌ను శనివారం సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిబ్బంది విధులను సక్రమంగా నిర్వహించాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. రైళ్లలో అక్రమంగా జరుగుతున్న మాదకద్రవ్యాల రవాణాను నిశితంగా పరిశీలించి నిరోధించాలని ఆదేశించారు. ఆర్‌పిఎఫ్, జిఆర్‌పి సిబ్బంది కలిసి అవగాహనతో పనిచేయాలని అన్నారు. ఫుట్ బోర్డు ప్రయాణంపై ప్రయాణికులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జిఆర్‌పి ఎస్ఐ సిహెచ్.శ్రీనివాసరావు, ఆర్‌పిఎఫ్ ఓసి మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

గ్రంథాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహాధ్యక్షునిగా ఉగ్రసేను

శ్రీకాకుళం అర్బన్ : గ్రంథాలయ సంస్థ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహాధ్యక్షునిగా నగర గ్రంథాలయ అధికారి పి.ఉగ్రసేను ఎన్నికయ్యారు. గుంటూరులో నిర్వహించిన రాష్ట్ర గ్రంథాలయ సంస్థల ఉద్యోగుల సంఘం ఎన్నికలు శనివారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో ప్రకాశం జిల్లాకు చెందిన సుబ్బారెడ్డి రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నిక కాగా, ఉగ్రసేను సహాధ్యక్షునిగాను, శ్రీకూర్మం గ్రంథాలయాధికారి పి.భాస్కర్‌రాజా, రాష్ట్ర ఉపాధ్యక్షులు సంతబొమ్మాళి గ్రంథాలయ అధికారి కె.రామకృష్ణలను ఎన్నుకున్నారు.

ఓటమి భయంతోనే పవన్‌పై ఆరోపణలు

ప్రజాశక్తి- టెక్కలి

వచ్చే ఎన్నికల్లో ఓటమి భయంతోనే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌పై వ్యక్తిగత విమర్శలు, ఆరోపణలు చేస్తున్నారని నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిరణ్ విమర్శించారు. టెక్కలి జనసేన కార్యాల యంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో జనసేన పార్టీకి పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేకనే పవన్ వ్యక్తిగత జీవితంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. వాలంటీర్లు చేస్తున్న అఘాయిత్యాలపై పవన్ మాట్లాడితే జగన్ తట్టుకోలేకపోతున్నారని, ప్రజల డేటా అంతా ప్రయివేటు వ్యక్తులు చేతుల్లోకి పోతుందని చెప్పారు. నియోజకవర్గం నాయకులు బుడ్డ గౌరయ్య, పేడాడ త్రివేణి, లింగుడు కుమారస్వామి, కొత్తూరు హరి, ఇలపండ రమేష్, ఆబోతు వెంకటరమణ, గద్దాయి భాస్కర్, శ్రీను, రమేష్ పాల్గొన్నారు.

కవిటి: రాష్ట్రంలో డేటాచోరీ జరుగుతోందని, దీనికి ప్రత్యక్ష ఉదాహరణ ఇటీవల కాలంలో చాలా మంది బ్యాంకు ఖాతాల నుంచి వారికి తెలియకుండానే నగదు పోవడమేనని ఇచ్ఛాపురం జనసేన నాయకులు లోళ్ల రాజేష్ ఆరోపించారు. జనసేన నాయకుడు పవన్ కళ్యాణ్‌పై ప్రభుత్వం పరువు నష్టం కేసు వేయడంపై రాజేష్ మండిపడ్డారు. దీన్ని ఖండిస్తూ స్థానిక లోళ్ల నారాయణమూర్తి కళ్యాణ మండపంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. తాము చేసిన తప్పులు ఎత్తి చూపిస్తే ఎగిరెగిరిపడుతున్న నాయకులు ఇటీవల కాలంలో చాలామంది బ్యాంకు అకౌంట్ నుంచి నగదు పోతున్నా పట్టుంచుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై బ్యాంకు అధికారులను సంప్రదిస్తే ఇటీవల కాలంలో మీరు ఎక్కడైనా వేలిముద్రలు వేశారా? అని అడుగుతున్నారని రాజేష్ తెలిపారు. సమావేశంలో జనసైనికులు ప్రశాంత్, కాళీ, పృథ్వి తదితరులు పాల్గొన్నారు.

కవిటి : మాట్లాడుతున్న రాజేష్

ఇచ్ఛాపురం : ఉమ్మడి నెల్లూరు జిల్లా వెంకటగిరిలో జరిగిన నేతన్న నేస్తంలో సిఎం జగన్ పవన్ కళ్యాణ్‌పై దిగజారుడు వ్యాఖ్యలు చేయడం సరికాదని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు అన్నారు. పట్టనంలోని నడిరోడ్డుపై బహిరంగ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. పవన్ చేపట్టిన వారాహి విజయయాత్ర రెండు విడతలతోనే వైసిపి నాయకుల ఫ్యాంట్లు తడిసిపోతున్నాయని ఎద్దేవా చేశారు. రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ తిప్పని దుర్యోధనరెడ్డి, మత్స్యకార రాష్ట్ర కార్యదర్శి నాగుల హరి బెహరా, నీలవేణి, దాసరి శేఖర్, రోకళ్ల భాస్కర్, కలియ గౌడ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మాట్లాడుతున్న రాజు

ఆమదాలవలస : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై దిగజారుడు వ్యాఖ్యలు మానుకోవాలని నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు అన్నారు. పట్టణంలోని జనసేన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పవన్ గురించి అసభ్య పదజాలంతో దిగజారుడు వ్యాఖ్యలు చేశారని, ఆ వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు తెలిపారు. జనసేన సరుబుజ్జిలి, పొందూరు మండల అధ్యక్షులు పైడి మురళీమోహన్, ఎలకల రమణ జన సైనికులు ఫణి కుమార్, అశోక్, రాజు, మున్నా, కరుణ సాగర్ పాల్గొన్నారు.

ఆమదాలవలస : మాట్లాడుతున్న మోహనరావు

పథకాలను వివరిస్తున్న స్పీకర్ సీతారాం

వాలంటీర్లపై విమర్శలా?

శాసనభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- పొందూరు

ప్రజలతో మమేకమై ప్రభుత్వ సంక్షేమ పథకాలను సకాలంలో అందజేస్తున్న వాలంటీర్లపై ప్రతిపక్షాలు విమర్శలు చేయడమేమిటని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం ప్రశ్నించారు. మండలంలోని కోటిపల్లిలో శనివారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎటువంటి అవినీతికి ఆస్కారం లేకుండా ప్రజలకు నిష్పక్షపాతంగా వాలంటీర్లు సేవలను అందజేస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన ఈ వాలంటీర్ వ్యవస్థను దేశంలోనే ఎంతో మంది ప్రశంసిస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలతో ముద్రించిన పోస్టర్లను అందజేసి... ప్రజా సమస్యలను అడిగి తెలుసుకునానరు. అలాగే జలజీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా రూ.54 లక్షలతో ఇంటింటికీ తాగునీటి కుళాయి ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సీపాన హరిహరరావు, జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, ఎంపిపి ప్రతినిధి కిల్లి నాగేశ్వరరావు, వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, ఎఎంసి ఛైర్మన్ బాడాన సునీల్‌కుమార్, సర్పంచ్ సుధారాణి. జి.అసిరినాయుడు, ఏ.వినయ్‌కుమార్ (పకీర్) పాల్గొన్నారు.

సత్వర తీర్పులు లక్ష్యం

శాశ్వత లోక్ అదాలత్ జడ్జి సువర్ణరాజు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సువర్ణరాజు

ప్రజాప్రయోజన సేవల్లో ఎటువంటి అవాంతరాలు జరిగినా శాశ్వత లోక్‌అదాలత్‌కు సత్వరమే సంప్రదించాలని శాశ్వత లోక్‌అదాలత్ జిల్లా న్యాయమూర్తి జ్ఞాన సువర్ణరాజు అన్నారు. జిల్లా లోక్ అదాలత్ సమావేశ మందిరంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ప్రజాప్రయోజన సేవల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే శాశ్వత లోక్‌అదాలత్‌కు సంప్రదించి ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లావ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖలు అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జిల్లా అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్య, వైద్య రంగాల సేవల్లో లోపాలు ఉంటే సకాలంలో ఫిర్యాదు చేయాలని కోరారు. న్యాయ సేవాధికార సంస్థల చట్టం-1987 మేరకు 2006లో శాశ్వత లోక్‌అదాలత్‌లు ఆవిర్భవించాయని, వీటి ప్రధాన ఉద్దేశం సమగ్రమైన, సత్వరమైన, శీఘ్రమైన తీర్పులు ఇవ్వడం శాశ్వత లోక్‌అదాలత్‌ల లక్ష్యమని అన్నారు. సమావేశంలో గృహ నిర్మాణశాఖ పీడీ నక్క గణపతిరావు, డ్వామా పీడీ బి.చిట్టిరాజు, మెప్మా పీడీ ఎం.కిరణ్ కుమార్, ఆర్‌టిసి, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

బాడీబిల్డింగ్‌కు గుర్తింపు పెరగాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వ్యాయామం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని, ప్రస్తుత పరిస్థితిలో బాడీబిల్డింగ్‌కు గుర్తింపు పెరగాలని వైసిపి యువజన విభాగం అధ్యక్షులు ఎం.వి.స్వరూప్ అన్నారు. నగరంలోని మండలవీధిలోని స్వరూప్ స్వగృహంలో శనివారం ఆలిండియా ఓపెన్ బాడీబిల్డింగ్ పోటీల పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాడీబిల్డింగ్ ఎంతో కష్టతరమైన, ఖర్చుతో కూడుకున్నదని అన్నారు. జిల్లాలోనే ఫ్లెక్స్ జిమ్‌కు ప్రత్యేక ఉందని, 20 ఏళ్లుగా ఎంతో మంది బాడీబిల్డర్లను తయారు చేసిన ఘనత గౌరీ శంకర్‌కు ఉందని తెలిపారు. ఫ్లెక్స్ జిమ్ అధినేత కొమ్మాన గౌరీశంకర్ ఆధ్వర్యాన ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్టు వివరించారు. సెప్టెంబరు 24న ఇతర రాష్ట్రాలకు చెందిన బాడీబిల్డర్లు సైతం పోటీల్లో పాల్గొని సిక్కోలు కీర్తిని చాటి చెప్పాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బంకు రాజు, రాజా, బి.నవీన్, పట్టా రామకృష్ణ పాల్గొన్నారు.

సర్వే చేస్తున్న బిఎల్‌ఒ ఉపేంద్ర

ముమ్మరంగా ఓటరు నమోదు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు చేపట్టిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని మండలంలో ముమ్మరంగా సాగుతోంది. మండలంలోని 38 గ్రామ పంచాయతీల పరిధిలో అన్ని గ్రామాల్లోని బిఎల్‌ఒలు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాల పరిధిలో పర్యటిస్తూ ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టారు. బిఎల్‌ఒలు ఓటరు జాబితాను తీసుకుని ఇంటింటికీ వెళ్లి సర్వే చేపట్టారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, ఇంటి నంబరు, ఓటరు పేరు, వయసు, వలస వెళ్లినా, ఫొటోలు సక్రమంగా లేకున్నా, కొత్త ఫొటోలు సేకరించి వారి వివరాలు గుర్తిస్తున్నారు. కోటబొమ్మాళిలో బిఎల్‌ఒ పూజారి ఉపేంద్రతో పలు పార్టీ నాయకులు ఓటరు నమోదు జరుగుతున్న తీరును పరిశీలించారు. కార్యక్రమంలో టిడిపి బూత్ ఇన్‌ఛార్జి తంగుడు సునీల్ తదితరులు ఉన్నారు.

పాఠశాలల సందర్శన

జి.సిగడాం : విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసించి మంచిస్థాయికి చేరుకోవాలని ఎంఇఒ-2 శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని నిద్దాం, అధ్వానంపేట గ్రామాల్లో పాఠశాలలను శనివారం సందర్శించారు. అలాగే విద్యార్థులతో ప్రాథమిక విషయ పరిజ్ఞానం ఎంత వరకు ఉన్నదో అనేది విద్యార్థులను పరీక్షించారు. అలాగే నిద్దాం ప్రాథమిక ఉన్నత పాఠశాలలో మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ పేదరికాన్ని అధిగమించి విద్యలో రాణించినప్పుడే భవిష్యత్ ఉజ్వలమవుతుందన్నారు. జగనన్న విద్యా కానుకలను ప్రభుత్వం అందజేస్తుందని అన్నారు. అనంతరం విద్యార్థులకు సెమిస్టర్-2 పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్.భాస్కరరావు, ఎంపిడిఒ కె.నిశ్చెన, డిటి ఎస్.నిర్మల పాల్గొన్నారు.

అప్పలనాయుడు పరామర్శ

లావేరు : మండలంలోని పలు గ్రామాల్లో ఎచ్చెర్ల నియోజకవర్గం వైసిపి నాయకులు లుకాలపు అప్పలనాయుడు శనివారం పరామర్శించారు. మురపాకకు చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయులు, వైసిపి నాయకులు తేనెల మంగయ్యనాయుడు మాస్టర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. బెజ్జిపురానికి వైసిపి నాయకులు, రేషన్ డీలర్ ఇజ్జడ వెంకటరమణ తల్లీ మాణిక్యామ్మ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న అప్పలనాయుడు వారి కుటుంబీకులను శనివారం పరామర్శించి సంతాపాన్ని, సానుభూతిని తెలియచేశారు. ఈయన వెంట మాజీ సర్పంచ్ వట్టి సత్యనారాయణ, నాగరాజు, పతివాడ గురునాయుడు, బాలి శ్రీనివాసునాయుడు, ఐ.వి.దన్నాన రాంబాబు, తేనేల సురేష్‌కుమార్ ఉన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఉద్యమం

25న విద్యాసంస్థల బంద్‌కు పిలుపు

ప్రజాశక్తి- పలాస

రాష్ట్రంలో విద్యా వ్యవస్థ రోజురోజుకు సమస్యలను ఎదుర్కొంటుందని, విద్యారంగ సమస్యలను పరిష్కారానికి ఉద్యమించాలని, అందులో భాగంగానే ఈ నెల 25న విద్యా సంస్థల బంద్ విజయవంతం చేయాలని ఎఐఎస్ఎఫ్ అధ్యక్షులు సిహెచ్.రవి పిలుపునిచ్చారు. కాశీబుగ్గ నారాయణ జూనియర్ కాలేజ్ వద్ద విద్య రంగ సమస్యలు పరిష్కారానికి సంబంధించి పోస్టర్‌ను శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యాన ఈ నెల 18న రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామని అన్నారు. సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో చదువుతున్న విద్యార్థులు నాణ్యమైన భోజనం లేక, సరైన మౌలిక సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. పెరిగిన నిత్యావసరల ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ ఛార్జీలను పెంచాలన్నారు. పేద ఇంటర్మీడియట్ విద్యార్థులకు గతంలో ప్రభుత్వం ఉచితంగా మెటీరియల్స్ ఇచ్చేవారని, కానీ, ఈ విద్యా సంవత్సరం పాఠ్యపుస్తకాలను ఎందుకు పంపిణీ చేయలేదని ప్రశ్నించారు. డిగ్రీ విద్యా విధానంలో ప్రవేశపెడుతున్న మేజర్, మైనర్ సబ్జెక్టు విధానాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న 53 వేల ఉపాధ్యాయ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలన్నారు. ప్రభుత్వం తీసుకువచ్చిన జిఒ నంబరు 77 వల్ల పేద పిజి విద్యార్థులు చదువు కోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన జాతీయ విద్యా విధానం వల్ల రాష్ట్రంలో వేల సంఖ్యలో స్కూళ్లు మూతపడ్డాయన్నారు. 3,4,5 తరగతుల విలీనం వల్ల విద్యార్థులకు విద్య దూరమవుతుందన్నారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నాయకులు పవన్, రాము. జీవన్, మానస, కుమారి, లావణ్య పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎఐఎస్ఎఫ్ నాయకులు

శ్రీకాకుళం అర్బన్ : వైద్య, విద్యను పేద విద్యార్థులకు అందని ద్రాక్షగా మార్చి ప్రయివేటు విద్యాసంస్థల్లో సీట్లు రూ.కోట్లకు అమ్ముకుంటున్నారని, దీనివల్ల పేద విద్యార్థులకు అన్యాయం జరుగుతోందని ఎఐవైఎఫ్ నాయకులు ఎం.యుగంధర్, కొన్న శ్రీనివాసరావులు ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని క్రాంతి భవన్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. విప్లవాత్మక మార్పులు అంటూ... బలహీన వర్గాల ప్రజలకు ఉన్నత విద్య దూరం చేయడమేనని అన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోరా?

ప్రజాశక్తి- పలాస

మున్సిపాలిటీలో ఎటువంటి అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా జరుగుతున్న అక్రమ కట్టడాలపై టౌన్ ప్లానింగ్ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని మున్సిపల్ ఛైర్మన్ బల్ల గిరిబాబు ప్రశ్నించారు. కేవలం నోటీసులతో సరిపెట్టకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో ఛైర్మన్ బల్ల గిరిబాబు అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సమావేశం శనివారం నిర్వహించారు. ఛైర్మన్ మాట్లాడుతూ ప్రతి సచివాలయం పరిధిలో ఉన్న టౌన్ ప్లానింగ్ సెక్రటరీతో సమన్వయం చేసుకుంటూ అక్రమ నిర్మాణాలపై కొరడా ఝులిపించాలని ఆదేశించారు. మున్సిపాలిటీ ఆదాయ వనరులను పెంచేందుకు అధికారులు ఆలోచించాలని కోరారు. 29 వార్డు కౌన్సిలర్ జోగ త్రివేణి మాట్లాడుతూ పారిశుధ్యం అధ్వానంగా ఉందని, మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 8 వార్డు కౌన్సిలర్ దుర్గాశంకర్ పండ మాట్లాడుతూ తమ వార్డు పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వంలో మంజూరైన నిధులతో తాము తయారీ చేసిన అభివృద్ధి కార్యక్రమాల్లో మార్పులు

అధికారులను ప్రశ్నిస్తున్న కౌన్సిలర్ దుర్గాశంకర్ పండా

చోటు చేసుకున్నయనే వార్తలు వినిస్తున్నాయని అన్నారు. 21 వార్డు కౌన్సిలర్ పప్పల ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ తమ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం జరిగి నెల రోజులు అవుతున్నా అభివృద్ధి కార్యక్రమాల కోసం ఇంజినీరింగ్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కమిషనర్ నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ అన్ని విభాగాల అధికారుల నుంచి ఎటువంటి ఇబ్బందులు లేకుండా జవాబుదారుతనంగా పనిచేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్లు మీసాల సురేష్, బోర బుజ్జి, కో-ఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రోత్సాహకాలను అందుకున్న విద్యార్థులు

విద్యార్థులకు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని ఎన్‌టిఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో చదువుతూ 2022-23 పదో తరగతిలో ప్రతిభ కనబరచి ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవదత్తానంద్ శనివారం నగదు ప్రోత్సాహకాలను అంజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు, దాతలు ఇతోధికంగా సాయమందిస్తున్నారని అన్నారు. వారిచ్చిన విరాళాలకు ఏడాది కాలం పాటు నికర వడ్డీ మొత్తాన్ని ఏటా ప్రోత్సాహకాలుగా అందజేస్తున్నట్టు తెలిపారు. విద్యార్థుల్లో పట్టుదల, శ్రమకుతో ప్రోత్సహించడం ద్వారా మరిన్ని అత్యుత్తమ ఫలితాలు సాధించడానికి తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాలఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని పెద్దలక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులకు ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ ఏడాది పదిలో అత్యధిక మార్కుల సాధించిన ఎన్.మానసచంద్రకు మెమోంటో, ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.వి.రమణమూర్తి, ఉపాధ్యక్షులు అట్ల రవికుమార్, పూర్వ విద్యార్థులు లింగాల సంజీవరావు, కొర్ల రెయ్యన్న, టంకాల సుందరరావు, మెట్ట మోహనరావు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

వ్యక్తిత్వ వికాస నిపుణులు వేణుగోపాల్

ప్రజాశక్తి- ఆమదాలవలస

విద్యార్థులు పాఠశాలలో చదువుతున్న సమయంలోనే తమ లక్ష్యాలను నిర్దేశించుకోవాలని వ్యక్తిత్వ వికాస నిపుణులు, పంచాయతీరాజ్ విశ్రాంత డిఇ బగాది వేణుగోపాల్ అన్నారు. చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.రామకృష్ణ ఆధ్వర్యాన పట్టణంలోని లక్ష్మీనగర్ హైస్కూల్లో శనివారం 8,9,10 తరగతులకు ఏర్పాటు చేసిన వ్యక్తిత్వ వికాస శిక్షణా తరగతుల్లో పాల్గొని మాట్లాడారు. కళలు కనడం అంటే పగటి కలలు కాదని, అలాగే గాఢమైన నిద్రలో కనే కళలు

మాట్లాడుతున్న వేణుగోపాల్

అసలే కావని అన్నారు. అనుకున్న లక్ష్యాలు సాధించే క్రమంలో కనే కళలు నిద్ర లేకుండా చేయాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో చైల్డ్‌రైట్స్ ఫోరం జిల్లా కో-కన్వీనర్ చిగిలిపల్లి రాజేష్, మండల ప్రధాన కార్యదర్శి చింతాడ అప్పారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పచ్చదనం పరిశుభ్రత అందరి బాధ్యత

మొక్కను నాటుతున్న కృష్ణచైతన్య

నరసన్నపేట : పచ్చదనం పరిశుభ్రతపై ప్రతిఒక్కరూ బాధ్యత వహించాలని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, పోలాకి జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణ చైతన్య సూచించారు. మండలంలోని సత్యవరం కూడలి వద్ద ఉన్న లచ్చుమియ్య చెరువు గట్టుపై శనివారం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొక్కలు నాటడం వల్ల పెద్దవి అయి ప్రాణ వాయువు ఇస్తాయని, తద్వారా మానవాళికి ఆరోగ్యం లభిస్తుందని తెలిపారు. అలాగే వాతావరణం కాలుష్యం నియంత్రణకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. మొక్కలు పెంపకానికి ప్రతిఒక్కరూ బాధ్యత వహించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి ఆరంగి మరళి, వైస్ ఎంపిపి ప్రతినిధి పాగోటి రాజారావు, సుడా ఛైర్మన్ ప్రతినిధి కె.సి.హెచ్‌గుప్త, దూకలపాడు సర్పంచ్ అసిరినాయిడు, ఉపాధి హామీ అధికారులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

జి.సిగడాం : భూమిని సాగు చేసి సమిష్టిగా భూమిని కాపాడదాం అనే విషయంలో పట్టు పరిశ్రమశాఖ జిల్లా అధికారి టి.రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యాన మండలంలోని నల్లపేట రైతులకు శనివారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఉత్సాహవంతమైన రైతులకు రేగింగ్ షెడ్డు నిరాణాలకు ఎస్‌సి, ఎస్‌టి రైతులకు రూ.3,60,000, బిసిలకు రూ.3 లక్షలు ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. మలబారి మొక్కలను ఎస్‌సి, ఎస్‌టి రైతులకు రూ.22,500, బిసి, ఓసిలకు రూ.18750 సహాయ, సహకారాలు ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. ఐదు ఎకరాల్లోపు భూమి ఉన్న రైతులకు, ఉపాధి హామీ జాబ్ కార్డు ఉన్న రైతులకు రూ.3 లక్షలు ప్రభుత్వం ఎనర్జీ ద్వారా రుణాలు

అవగాహన కల్పిస్తున్న రాజేంద్రప్రసాద్

అందజేస్తుందని తెలిపారు. పశువుల ఎరువులు ఎక్కువగా వాడి మల్బరీ తోట పెంచగలిగితే నాణ్యత బాగుంటుందని, పట్టు గుళ్ల కలెక్టరేట్‌లో పట్టు పరిశ్రమ ఆఫీసు దగ్గర అమ్ముకోవడానికి అవకాశం ప్రభుత్వం కల్పిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ అప్పలనాయుడు, గ్రామస్తులు సన్యాసమ్మ, నరేష్, రవణమ్మ, రత్నకుమారి, అసిరినాయుడు పాల్గొన్నారు.

ప్రభాకరరావు అరెస్టు అన్యాయం

టెక్కలి : కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు దుడ్డు ప్రభాకరరావు అక్రమ అరెస్టు అన్యాయమని కుల నిర్మూలన పోరాట సమితి నాయకులు మిస్కా కృష్ణయ్య, బెలమర ప్రభాకరరావు అన్యాయమని అన్నారు. శనివారం విలేకరులతో మాట్లాడారు. నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఎ) పోలీసులు శుక్రవారం విజయవాడలో ప్రభాకరరావు ఇంటిపై దాడి చేసి దొంగల ముఠాగా 30 మంది పోలీసులు వచ్చి అరెస్టు చేశారని అన్నారు. ఉపా, ఎన్ఐఎల చట్టాలను రద్దు చేయాలని, మణిపూర్ రాష్ట్రంలో దళితులపై దాడులపై ప్రజలను చైతన్యపరిచి ఉద్యమాల్లో ప్రభాకరావు చురుగ్గా పాల్గొన్నారని అన్నారు. ప్రభాకరరావును నిర్బంధించి పోరాటాలను అణిచివేతలో భాగంగానే ఈ అక్రమ అరెస్టు చేశాశారని అన్నారు. కార్యక్రమంలో అమరుల బంధుమిత్రుల సంఘం నాయకులు జోగి కోదండం, ఉత్తరాంధ్రా మహిళా సంఘం నాయకులు పోతనపల్లి అరుణ, నాగమణి, హక్కుల సంఘం నాయకులు ఉగ్రిపల్లి సోమనాథం, కె.ధర్మారావు, రాకోటి రాంబాబు, నల్లబరికి గురుమూర్తి పాల్గొన్నారు.

చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వాణి

జగన్ చిత్రపటానికి పాలాభిషేకం

టెక్కలి రూరల్ : వైఎస్ఆర్ రైతన్న నేస్తం ఐదో విడత నిధులు లబ్ధిదారులు ఖాతాలో జమ చేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దువ్వాడ వాణి స్వగృహంలో శనివారం పాలాభిషేకం చేశారు. అనంతరం నియోజకవర్గ చేనేత కార్మికులు వాణికి పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువ కప్పి సన్మానించారు. దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ దీప్తి శంకర్, తామరాపల్లి సొసైటీ ఛైర్మన్ బొచ్చు కృష్ణారావు, వైస్ సర్పంచ్ రామారావు, ఎంపిటిసి సైలాడ లావణ్య పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న తిలక్

ఇంటింటికీ తాగునీరు

ప్రజాశక్తి- నందిగాం

ఇంటింటికీ తాగునీటి సౌకర్యం కల్పించడమే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి లక్ష్యమని కళింగ కార్పొరేషన్ ఛైర్మన్ పేరాడ తిలక్ అన్నారు. మండలంలోని లఖిదాసుపురంలో జెజెఎం పథకంలో భాగంగా రూ.30 లక్షలతో చేపట్టనున్న తాగునీటి పథకానికి ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తితో కలిసి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ అన్ని గ్రామాలకూ స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా ప్రభుత్వం చేస్తుందని అన్నారు. గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు కురమాన బాలకృష్ణారావు, వైసిపి నాయకులు బొంగి మోహనరావు, పల్ల అప్పారావు, మాదిన గోపాలకృష్ణ, నడుపూరు పాపారావు, ఉప సర్పంచ్ సిమ్మయ్య, జోగారావు, లిమ్మ అశోక్, ఎంపిడిఒ శివప్రసాద్, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ ఆర్.మధుసూదనరావు పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ

ఇచ్ఛాపురం : నియోజకవర్గం పరిధిలో గ్రూప్ 1,2 ప్రవేశ పరీక్షలకు చదువుతున్న అభ్యర్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కొంత మందికి ఉపయోగపడే విధంగా పుస్తకాలు అందిస్తున్నామని సీడాప్ ఛైర్మన్ శ్యామ్‌ప్రసాద్ రెడ్డి తెలిపారు. డాక్టర్ దక్కత త్రినాధరెడ్డి చేతుల మీదుగా శనివారం పుస్తకాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆమదాలవలస : విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత స్థానాలను అధిరోహించాలని రోటరీ సర్వీస్ ప్రాజెక్ట్ ఛైర్మన్ పి.తేజలక్ష్మి అన్నారు. గార మండలంలోని వమరవెల్లిలోని డైట్ మోడల్ స్కూల్ విద్యార్థులకు రెండోరోజు తెలుగు రైట్ కాపీయింగ్, గణితం పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పుస్తక వితరణ మహోత్సవం శనివారంతో ముగిసిందని తెలిపారు. కార్యక్రమంలో విద్యా కమిటీ ఛైర్మన్ మీనాకుమారి, డైట్ మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు కిల్లి ఈశ్వరరావు, కింతలి బాబూరావు, శాంతమ్మ, అప్పాయమ్మ పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

మృతి చెందిన ఆవుతో నిరసన

కవిటి: మండలంలోని బింగుపుట్టుగకు చెందిన ఎర్ర బాలయ్య ఎనిమిదేళ్లుగా విశాఖ డెయిరీలో పాలు పోస్తున్నాడు. అందులో భాగంగానే తన వద్ద ఉన్న ఆవుకు గతేడాది అక్టోబరు 15న విశాఖ డెయిరీ ఆధ్వర్యాన బీమా చేయించాడు. అయితే ఇటీవల విశాఖ డెయిరీ కంటే లీటరుకు రూ.5 పైగా ఎక్కువ డబ్బులు ఇవ్వడంతో నెల రోజులుగా బాలయ్య హెరిటేజ్ పాల కేంద్రంలో పాలు పోస్తున్నాడు. ఈలోగా అనుకోకుండా బాలయ్య ఆవు శుక్రవారం రాత్రి చనిపోయింది. దీంతో విషయాన్ని బాలయ్య విశాఖ డెయిరీ ఏజెంట్‌కు తెలిపారు. బాలయ్య తమ డెయిరీలో పాలు పోయడం లేదు కాబట్టి ఇన్సూరెన్స్ ఇవ్వలేమని విశాఖ డెయిరీ ఏజెంట్ గున్నయ్య తెలిపారు. దీంతో తనకు న్యాయం చేయాలని కోరుతూ శనివారం ఉదయం నుంచి భింగుపుట్టుగలో ఉన్న విశాఖ డెయిరీ పాల కేంద్రం వద్ద చనిపోయిన ఆవుతో బాలయ్య నిరసన తెలియజేస్తున్నాడు. సాయంత్రం స్థానిక పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేసినట్టు గున్నయ్య తెలిపాడు. విషయం తెలుసుకున్న పాడి రైతులు పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకుని బాధితు రైతుకు మద్దతుగా ఆందోళన చేపట్టారు.

పుస్తక నిర్వహణను పరిశీలిస్తున్న కూర్మారావు

అర్హతే ప్రామాణికం

ప్రజాశక్తి- ఆమదాలవలస

గ్రామీణ ప్రాంతంలోని మహిళా స్వయంశక్తి సంఘాలు, గ్రామ సంఘాలు ఎ-గ్రేడ్‌లో ఉంటే అర్హతే ప్రామాణికంగా అన్ని సంక్షేమ పథకాలు గ్రూపు సభ్యుల ఇంటి దగ్గరకే వస్తాయని వైఎస్ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. మండలంలోని కనుగులవలస సచివాలయంలో స్వయం శక్తి సంఘాల పుస్తక నిర్వహణను శనివారం పరిశీలించి సంఘ సభ్యులకు పలు సూచనలు చేశారు. అర్హత గల అన్ని సంఘాల ఖాతాలకు మూడు విడతలుగా వైఎస్ఆర్ ఆసరా నిధులు జమైనట్లు తెలిపారు. 45 నుంచి 60 ఏళ్లలోపు ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనారిటీ, వెనుకబడిన మహిళలందరి ఖాతాలకూ వైఎస్ఆర్ చేయూత పథకం మంజూరై నిధులు వారి వ్యక్తిగత ఖాతాలకు జమైనట్లు వివరించారు. కార్యక్రమంలో విఒఎ ప్రశాంతి, గ్రామ సంఘం ప్రతినిధులు బెండి లక్ష్మి, సీపాన అనురాధ, పాతిన లక్ష్మి, బెండి కుమారి పాల్గొన్నారు.

కల్వర్టు పనులను పరిశీలిస్తున్న ఛైర్మన్ గిరిబాబు

కల్వర్టు పనులు వేగవంతం

పలాస : పలాస-కాశీబుగ్గ కెటి రోడ్డు పనుల్లో భాగంగా చేపడుతున్న కల్వర్టు పనులను వేగవంతం చేసి ప్రజలకు రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని మున్సిపల్ ఛైర్మన్ బల్ల గిరిబాబు అధికారులకు ఆదేశించారు. ఈ మేరకు కల్వర్టు పనులను శనివారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీనివాసు లాడ్జి కూడలి వద్ద నిత్యం ప్రజలతో రద్దీగా ఉంటుందని, పలు ఆస్పత్రులు ఉండడంతో రోగులు ఇబ్బంది పడే పరిస్థితి ఉందని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని త్వరగా పూర్తి చేయాలన్నారు. కల్వర్టు పనులు చేపట్టే సమయంలో నాణ్యత పాటించాలన్నారు. కమిషనర్ టి.నాగేంద్రకుమార్, మున్సిపల్ డిఇ బల్ల హరి, మున్సిపల్ ఎఇఇ అవినాష్ పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

పాలవలసలో 'పొలంబడి'

సోంపేట: మండలంలోని పాలవలసలో శనివారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు కె.జగన్మోహనరావు, మండల ఎఒ నరసింహమూర్తి పాల్గొని రైతులకు మేలైన యాజమాన్య పద్ధతులపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంటలపై పురుగుల మందుల విష ప్రభావం రైతులకు ఉన్న వ్యవసాయ విజ్ఞానంపై తెలుసుకొనేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఆగస్టు 6 నుంచి నవంబరు వరకు 14 వారాలు పొలంబడి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. రైతులు ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది ప్రవీణ్, కుమారి, ఉష, రైతులు శంకర్, శ్రీను పాల్గొన్నారు.

వీల్‌చైర్లు అందజేత

శ్రీకాకుళం అర్బన్ : అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయానికి అల్మాజీపేటకు చెందిన నందమూరి చిట్టిబాబు జ్ఞాపకార్థం వికలాంగులకు సౌకర్యంగా తీసుకెళ్లేందుకు రెండు చక్రాల కుర్చీలను న్యూ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధులు అందజేశారు. ఆలయ సీనియర్ అసిస్టెంట్ క్రిష్ణామాచార్యులను కలిసి శనివారం వీటిని అందజేశారు. డాక్టర్ మంత్రి వెంకటస్వామి, బ్లడ్ బ్యాంకు మేనేజర్ టి.మణికంఠ, గ్రీన్ సిటీ అధ్యక్షులు మణిశర్మ, డాక్టర్ పైడి ప్రదీప్ పాల్గొన్నారు.